కర్నూలు I నంద్యాల
వార్త
5 ఆగస్టు , 2022 | శుక్రవారం | పేజీలు 4

## భక్తుల కిటకిటలాడిన ఉరుకుంద పుణ్యక్షేత్రం..





**కౌతాళం, ఆగస్ట్04, ప్రభాతవార్త ;** మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో శ్రావణ మాస మొదటి గురువారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఈరన్నస్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారికి ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రసాదాన్ని తయారు చేశారు. స్వామివారికి అందించి పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈనెల చివరి వరకు శ్రావణమాస ఉత్సవాలు ఉన్నాయని ఆలయ ఈఓ వాణి తెలిపారు. వచ్చిన భక్తులకు మంచినీరు, వసతి, స్నానాలు చేసేందుకు షవర్లు, అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## నాడు నేడు పనులు
# వేగవంతం చేయాలి..

- ఈనెల 10వ తేది లోపల వందశాతం గ్రౌండింగ్ జరగాలి
- విడియోకాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ



**నంద్యాల విద్య, ఆగష్టు 4, ప్రభాతవార్తః** రెండవ విడత మనబడి నాడు నేడు కింద పనులు చేపట్టిన వివిధ దశల్లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. గురువారం విజయవాడ నుంచి కలెక్టర్లతో, డిఇఒలతో సమగ్ర శిక్షాధికారులతో విడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రెండవ విడత చేపట్టిన నాడు నేడు పనులను త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. అదనపు తరగతి గదులు, టాయిలెట్స్, నీటి మరమ్మత్తులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులు వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. ఈనెల 10వ తేదిలోపల పెండింగ్‌లో ఉన్న నాడు నేడు పనులను వందశాతం గ్రౌండింగ్ చేయాలన్నారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా అన్నిరకాల చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ నాడు నేడు పనుల పురోగతిపై ప్రతిరోజు ఎంఇఒలతో సమీక్షించాలని డిఇఒ వసుంధరాదేవిని ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు 60 శాతం అందాయని మిగిలిన 40శాతం పంపిణి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర ఆదేశించారు. జగనన్న విద్యాకిట్‌లు కూడ 100 శాతం పంపిణి కావాలన్నారు. విడియో కానఫ్రెన్స్‌లో డిఇఒ వసుంధరాదేవితో పాటు విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనురాధ, సెక్టోరియల్ అధికారి లలిత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో కృష్ణమ్మ పరవళ్ళు..

: ఓక క్రస్ట్‌గేటును 10 అడుగుల ఎత్తుమేరకు తేరచి దిగువ సాగర్‌కు నీటిని విడుదల



**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు04, ప్రభాతవార్త :** శ్రీశైలం రిజర్వయర్‌కు వరద ప్రవాహం మరింత పుంజుకోవడంతో జలశయం గరిష్టస్థాయి నీటినిల్వలకు మించి డ్యాంకు వచ్చిచేరుతుండడంతో కృష్ణమ్మ పరవళ్ల త్రోక్కుతూ శ్రీశైలం డ్యాం నుండి వడివడిగా ముందుకు సాగిపోతుంది. ఈ నేపథ్యాంలోనే ఎగువ ఉన్నా జలశయాల నుండి వచ్చిచేరుతున్న నీటిని జలవనరులశాఖ అదికారులు అంచనాలు వేస్తు అప్రమత్తంగా ఉన్నారు. వరద నీరు అత్యదిక క్యూసెక్యులు చేరడంతో డ్యాం జలకళను సంతరించుకోని నిండుకుండాల తోనికిసులాడుతుంది. ఈక్రమంలోనే శ్రీశైలంకు బారిగా వరద నీటి చేరికలు వచ్చిచేరుతుండడంతో అదికారులు శ్రీశైలం రెడియల్ ఒక క్రస్ట్‌గేటును 10 అడుగుల ఎత్తుమేరకు తేరచి దిగువ సాగర్‌కు నీటిని విడుదల చేయడం జరుగుతుంది. గత నెల జులై మాసంలో 22 వ తేదిన శ్రీశైలం రిజర్వయర్‌కు వరద నీటి ప్రవాహం పెరగడంతో ఏపి జలవనరులశాఖ మంత్రివర్యులు అంబటి రాంబాబు, శ్రీశైలం నియేజకవర్గం ఏమ్మెల్య్ శిల్పాచక్రపాణిరెడ్డి, నంధ్యాల జిల్లా ఏంపి పోచాబ్రహ్మానందరెడ్డి, నంద్యాల జిల్లా సర్వోన్నతాదికారి మంజిరి జిలానీ, శ్రీశైలందేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్నలు సంయుక్తంగా కలసి శాస్త్రోక్తంగా గంగమ్మకు పూజలు నిర్వహించి తదనంతరం మూడు రెడియల్ క్రస్ట్‌గేట్లను తెరచి నీటిని విడుదల చేసారు. ఈక్రమంలోనే మూడు రోజులపాటు అదికారులు నీటిని గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం జరిగింది. అదే విధంగా ఎగువ నుండి డ్యాంకు వరద నీరు తగ్గడంతో ఎట్టకేలకు జులై 25 వ తేదిన గేట్లను మూసివేశారు. కాగా డ్యాం నీటినిల్వలు మరోమారు పెరగడంతో రెండవ సారి శ్రీశైలం రెడియల్ ఒక క్రస్ట్‌గేటును తెరచి ఒక్క స్పిల్‌వే గుండా దిగువ సాగర్‌కు 27,662 క్యూసెక్యుల నీటిని దిగువ విడుదల చేయడం జరుగుతుంది. ఈక్రమంలోనే శ్రీశైలంకు ఎగువన ఉన్నా జూరాల గేట్లను తేరచి 40,670 క్యూసెక్యుల నీరు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 41,222 క్యూసెక్యుల నీరు, సుంకేసుల నుండి 1,16,062 క్యూసెక్యుల, హంద్రీ నుండి 250 క్యూసెక్యుల నీరు, మొత్తం 1,98,204 క్యూసెక్యుల నీటి ప్రవాహం వచ్చి చేరుకుంది. కాగా శ్రీశైలం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా డ్యాం నీటినిల్వ సామర్థ్యం 215.807 టియంసిలుగా ఉంటుంది. ఈక్రమంలోనే శ్రీశైలం రిజర్వయర్ గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి నీటిమట్టం 884.10 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 210.5133 టియంసిలుగా నమొదు అయింది. అదే విధంగా వచ్చిచేరుతున్న వరద నీటి ప్రవాహంతో తెలంగాణా రాష్ట్రాం ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో టి.ఎస్.జెన్-కో అదికారులు విద్యుత్ ఉత్పత్తిని కోనసాగిస్తు ఉత్పత్తి అనంతరం దిగువకు 31,784 క్యూసెక్యుల నీరు విడుదల చేయడం జరుగుతుంది. అదే విధంగా శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి చేస్తు 32,237 క్యూసెక్యుల నీరు విడుదల చేయడం జరుగుతుంది. కాగా శ్రీశైలం డ్యాంకు ఇదే విధంగా బారిగా వరద నీరు వచ్చిచేరుతుంటే జలశయం అదికారులు గేట్ల సంఖ్యాను కూడా పెంచే అవకాశాలు ఉన్నాయి.

# ఐశ్వర్య ప్రదాయిని.. వరలక్ష్మి..

- విశేష పూజలందుకోనున్న సౌభాగ్య మహాలక్ష్మి..
- ప్రత్యేక వ్రతాలకు ఆలయాలు సిద్ధం..
- భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు మహిళలు ఏర్పాట్లు..
- నేడు వరలక్ష్మి వ్రతం..



"వరాలిచ్చే, ఐశ్వర్య ప్రదాయిని వరలక్ష్మి వ్రతానికి, వ్రత పూజలకు మహిళలు సిద్ధమయ్యారు..భక్తిశ్రద్దలతో ఆచరించే వ్రత నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.. పూజాసామాగ్రి, పూలు, పండ్లు, ఇతర వస్తువుల కొనుగోలు చేసారు..ప్రత్యేక వ్రతాలకు జిల్లాలోని అమ్మవారి ఆలయాలు కూడా సిద్ధమయ్యాయి.. వ్రతాన్ని నియమ నిష్టలతో ఆచరిస్తే సకల సంపదలతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కూడా కలుగుతుందని పురోహితులు చెబుతున్నారు"..

2లో

**కోసిగి, ఆగస్టు 4, ప్రభాతవార్త :** వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మి దేవిని మహిళలు పూజిస్తారు.. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతం నిర్వహించుకోవడం సంప్రదాయంగా వస్తోంది.. ఈ వ్రతాన్ని ముఖ్యంగా వివాహిత స్త్రీలు ఆచరిస్తారు.. సకల ఐశ్వర్యాలు లక్ష్మిదేవి అనుగ్రహంతో సిద్ధిస్తాయి కాబట్టి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం గృహిణులు ఈ వ్రతాన్ని నిర్వహిస్తారు.. ఈపండుగ కోసం మహిళలు ఏడాదిపాటు ఎంతో ఓపికతో ఎదురుచూస్తారు..వారం రోజుల ముందు నుంచే మహిళలు ఈ వేడుక నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించడం విశేషం..

# జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జనాలు సుభిక్షం

- పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికి సంక్షేమ ఫలాలు అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యం
- హంద్రీనీవా నుండి గ్రావిటీ ద్వార పి కోటకొండ చెరువుకు నీళ్లు మళ్లించేందుకు చర్యలు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



**దేవనకొండ, ఆగస్టు 4, ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను ప్రవేశపెట్టి ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడంతో రాష్ట్రంలో జనాలు సుభిక్షంగా ఉన్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పి కోటకొండ గ్రామంలో గడప గడపకు వైసిపి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి గుమ్మనూరు జయరాం, వారి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణస్వామిలతో కలిసి గ్రామ సర్పంచ్ బండమీది తిక్కమ్మ భర్త లింగన్న ఆద్వర్యంలో నిర్వహించారు. ముందుగా గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ తమ శాఖలకు సంబంధించి విధి నిర్వహణలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అనంతరం గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. అర్హత కలిగి ఉండి ఎవరికైనా పథకాలు చేరకపోతే వారికి అందేలా సచివాలయ సిబ్బంది, వాలంటరీలు చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయ ఆవరణం నందు జన్మభూమి కమిటీల పేరుతో గత టిడిపి ప్రభుత్వంలో కేవలం టిడిపి కార్యకర్తలకు మాత్రమే న్యాయం జరిగిందని మిగిలిన ప్రజలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. కప్పట్రాళ్ల సమీపంలోని హంద్రీనీవా కాలువ నుండి గ్రావిటీ ద్వార పి కోటకొండ చిన్న చెరువుకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అలాగే 30పడకల ఆసుపత్రి నిర్మించేందుకు కూడ తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జగన్‌తోనే సాధ్యమన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. టిడిపి నాయకులు రెచ్చగొట్టే మాటలు విని మోసపోకుండ ప్రజలు ప్రశాంత జీవనం గడపడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జడ్పిటిసి కిట్టు, ఎంపిపి లక్ష్మిదేవి భర్త లుముంబ, వైసిపి మండల కన్వినర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, దివాకర్ నాయుడు, సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ఏపి శ్రీనివాసులు, ఇంచార్జ్ ఎంపిడిఓ ఇద్రూష్ భాష, ఇంచార్జ్ తహశీల్దార్ సుదర్శనం, సర్పంచ్ అరుణ్‌కుమార్, ఎంపిటిసి విజయలక్ష్మి, వైస్ ఎంపిపి మాదక్క భర్త నాగప్ప, వైసిపి నాయకులు హను మంతురెడ్డి, మీనిగ కృష్ణ, లింగన్న, లక్ష్మణస్వామి నాయుడు, రామానాయుడు, రామచంద్ర, గిడ్డయ్య, ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మదన్‌మోహన రెడ్డి, రామచంద్ర, రామాంజినేయులు, వీరేష్, ఎల్‌కె శీను, చంద్రన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఒక ప్రాణం తిరిగి ఇప్పించగలరా..
# వద్దని చెబితే వినరు

- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం -ఎవరి ఇగో వారిదే..



**మిడుతూరు, ఆగష్టు 4, ప్రభాతవార్త:** అనుకున్నదంత అయింది ఊహించిందంత కళ్ళకు కట్టినట్లు కనపడుతుంది. పిల్లల పాఠశాలల మార్పు పిల్లల రాకపోకలకు ఇబ్బంది అంటే ఎవరు వినరు. ఏమైన అంటే ఇంటి పక్కన పాఠశాల కట్టాల అని ఎగతాళి చేస్తారు. మరిప్పుడు కనపడుతున్న రుజువుల వల్ల విద్యార్థుల ప్రాణాలకు భాధ్యులెవరు. ఒక ప్రాణం తిరిగి ఇవ్వగలరా. మండలంలోని చింతలపల్లె గ్రామంలో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న కుందూనదిని గురువారం సాయంత్రం దాటి తల్లి దండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను సుదూరంగా ఉన్న పాఠశాలలో విద్యను అభ్యసించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కాగా ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలకు విద్యార్థులు తల్లిదండ్రులు ధర్నాలు, నిరసనలు చేపట్టి ఆంధోళనలు చేసిన ప్రభుత్వానికి నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలల మార్పు వల్ల వాగులు వంకలు చిన్న పిల్లలు దాటలేరని చెప్పిన ఎవరు పట్టించుకోవడం లేదని ఓ మంత్రి ఏకంగా పాఠశాలలను మీ ఇళ్ళ వద్ద కట్టాలా అని ఎద్దేవ చేస్తున్నారని పలువురు అంటున్నారు. చింతలపల్లి గ్రామంలో పాఠశాలకు వెళ్ళిన విద్యార్థులు తిరిగి సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్ళే సమయంలో గ్రామం మద్యనున్న కుందూనదిలో నీరు పెరిగి ప్రమాదకరంగా ప్రవహించింది. దీంతో పిల్ల తల్లిదండ్రులు చేసేది ఏమి లేక చీకటి పడే సమయం సమీపిస్తుండడంతో విద్యార్థులను తల్లిదండ్రులు ప్రమాదకరమైన ప్రయాణం చేశారు. కొందరి పిల్లలు నడవలేకుంటే ఎత్తుకొని నదినిదాటారు. ఈ ప్రయాణంలో పిల్లలకు, పెద్దలకు ప్రమాదం జరిగితే భాధ్యులు ఎవరు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు కళ్ళు తెరవాలి. లేదంటే ఏదో ఒక ప్రమాదం జరిగితే కాని ప్రభుత్వంలో చలనంరాదు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడితే తీవ్రపరిణామాలు భవిషత్తులో ఎదుర్కోవాల్సి వస్తుందని సర్పంచు రమణమ్మ, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి హెచ్చరించారు.



# మోడల్ స్కూల్‌లో విద్యార్థి ఆత్మహత్య..



**ఓర్వకల్లు, ఆగస్టు 4, ప్రభాతవార్త :** ఓర్వకల్లు మండల పరిధిలో ఉన్న మోడల్ స్కూల్‌లో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకునా న్నడు. ఆ మృతిపై పాఠశాల అధ్యాపకులపై అనుమానాలు వచ్చాయి. అదే కోణంలో తల్లిదండ్రుల మందలింపు కూడా కారణమనే వాదన విన్పించింది. ఏది నిజం అన్న విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రస్తుతానికి పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఓర్వకల్లు మండలం, హుస్సేనాపురం గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ భాష కుమారుడు షేక్ నూర్ అహ్మద్ (14), ఓర్వకల్లు మోడల్ స్కూల్ నందు 8వ తరగతి చదువుతున్నాడు. షేక్ నూర్ అహ్మద్‌ను అతని తల్లి హాస్టల్ లో ఉండి చదువుకొమ్మని మందిలించినట్లు సమాచారం. కాగా హాస్టల్‌లో ఉండి చదవడం ఇష్టంలేక శుక్రవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థి రెండవ పిరియడ్‌లో బాత్రూంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. తరువాత అతను వాంతులు చేసుకోవడం గమనించి చికిత్స నిమిత్తము కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి చేరకుముందే అతను చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ విషయంలో బాలల హక్కుల నేతలు విచారణ ప్రారంభించారు. సదరు కేసును ఒక కట్టుకథ లాగా తయారు చేశారని అంటున్నారు. స్వంత తల్లి అయినా ఆత్మహత్య చేసుకునే స్థాయిలో మందలించడం తప్పేనని ఆమెపైనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని సూచిస్తున్నారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తానే తన కుమారున్ని మందలించినట్లు తల్లి పేర్కొనడం సాక్ష్యంగా తీసుకోవచ్చన్నారు. పోలీసులు ఏకపక్ష విచారణ చేశారని అర్థమవుతుందని విమర్శించారు. ఈ కేసులో పోలీసుల విచారణ ఎలా ఉన్నా బాలల హక్కుల సంఘాల నాయకులు మాత్రం తమ మార్గంలో తాము కేసు విచారిస్తామని చెబుతున్నారు. ఇక్కడ పోలీసులు పాఠశాల యజమాన్యంతో కుమ్మక్కయ్యారా అన్న అనుమానాలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ముఖ్యంగా విద్యార్థి మృతిపై విద్యా శాఖ ఎలాంటి వివరాలు వెల్లడించకుండా పోలీసుల ద్వారా మాత్రమే వివరాలు వెల్లడి చేయడంపై పలు అనుమానాలున్నాయి. ఏది ఏమైనా ఈ కేసులో పోలీసుల విచారణ ఒక వైపు ఉండగా విద్యా శాఖ విచారణ మరోవైపు ఉంటుంది. ఇక బాలల హక్కుల విషయంలో మరో కోణంలో విచారణ జరుగుతోంది.

# నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ



**నందికొట్కూరు, ఆగష్టు 4, ప్రభాతవార్త:** పట్టణంలోని పోలీసు స్టేషన్‌ను నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి గురువారం ఆకస్మిఖ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, క్రైమ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాధారణ తనిఖీలలో బాగంగా రావడం జరిగిందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సి.ఐ.సుధాకర్‌రెడ్డి, ఎస్సై కె.వి.బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల విధాత ముఖ్యమంత్రి

- జోరువానలో ఎమ్మెల్యే గడప గడప కార్యక్రమం



**నంద్యాల క్రైం, 05, ఆగష్టు 4, ప్రభాతవార్తః** సంక్షేమ పథకాలను ప్రజలదరికి చేర్చే విధాతగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారని నంద్యాల శాసన సభ్యులు శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. జగనన్నర పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. గురువారం 39వవార్డు రోజాకుంట లో గడప గడప కార్యక్రమం నిర్వహించారు. జోరువాన కురుస్తునా న్న ఇంటింటికి వెళ్లి అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకోన్నారు. అక్కడికక్కడే పరిస్కార మార్గాన్ని చూపిం చారు. ముందుగా వార్డు ప్రజలు శిలా ్రకు ఘనంగా స్వాగతం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్‌చైర్మన్లు పాంషావలి, అవార్డు కౌన్సిలర్ వెంకట లక్ష్మమ్మతో కలిసి గడప గడప కార్యక్రమాని న్న నిర్వహించారు. అటుపిమ్మట ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను లబ్దిదారులకు చేర్చేపనిలో నిమగ్నమయ్యారన్నారు. సంక్షేమ పథకాలు అందని యేడల తమదృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. డ్రైనేజి సమస్యలను వార్డు ప్రజలు ఎమ్మెల్యే ముందుంచారు. తక్షణమే అధికారులతో మాట్లాడి ఆ సమస్యను పరిష్క రించారు. రా ష్ట్ర ముఖ్య మం త్రి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ ద్వారా అర్హులైన లబ్దిదారులకు ఇంటివద్దకే పథకాలు రావడంతో ఆనందడోలికల్లో ఉన్నారన్నారు. అనాడు పాదయాత్రలో ఇచ్చిన హామిలను తూచతప్ప కుండా నేరవేర్చడం జరిగిందని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రిదే అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏనాడైనా 1వ తేదినే ఫించన్ అందించిన చరి త్ర ఉందా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలను టిడిపి నాయకులు ఓర్వలేక బురదచల్లే పనులు పెట్టుకున్నారని ఆరోపించారు. ఇన్ని సంక్షేమ పథకాలు అమలుచేసిన ఘనత దేశంలో ఎక్కడలేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి పార్టీ కనుమరుగయ్యే అవకాశం ఉదన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు షాదిక్, చంద్రశేఖర్, తమిమ్, పోలూరుమహేశ్వర్‌రెడ్డి, వార్డువైసీపీ నాయకులు, జి కుమార్, హానిఫ్, మహబూబ్, నాజు, అన్వర్, ఖలీల్, రఫీ, వెంకటనారాయణ, వై కృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలపై.. దాడులు

- రూ.8.48 లక్షల ఎరువుల సీజ్
- అధికంగా పంచముఖి ట్రేడర్స్ రూ.3.50 లక్షల ఎరువుల సీజ్



**మాధవరం(మంత్రాలయం), ఆగస్టు 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఉన్న ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారులు గురు వారం ఆకస్మిక దాడులు నిర్వ హించారు. ముఖ్యంగా గ్రామంలో ఉన్న పంచముఖి ట్రేడర్ ్స, మారుతి ట్రేడర్ ్స, పాండురంగ ట్రేడర్ ్స, బీమా ట్రేడర్ ్స తదితర ఎరువుల దుకాణాలను ఏడిఏ మహమ్మద్ ఖాద్రి తనిఖీ చేశారు. దుకాణాలలో ఉన్న ఎరువుల స్టాకును పరిశీలించారు. ఇప్పటి వరకు వచ్చిన ఎరువులు రైతులకు విక్రయించిన వివరాలను సేకరించారు. దుకాణాలలోని ఓ ఫామ్‌ను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎరువులకు సరైన పత్రాలు లేకుండా అమ్మకాలు జరిపిన సుమారు రూ.8.48 లక్షల విలువగల ఎరువులను విక్రయించకుండా సీజ్ చేశారు. అత్యధికంగా రాయచూరు రోడ్డులో ఉన్న శ్రీ పంచముఖి ట్రేడర్ ్స దుకాణంలో రూ.3.50 లక్షల ఎరువులను సీజ్ చేశారు. అదేవిధంగా శ్రీ పాండురంగ ట్రేడర్ ్స రూ.1.74 లక్షలు విలువగల ఎరువులు, శ్రీ బీమా ట్రేడర్ ్స రూ.2.0 లక్షల విలువగల ఎరువులు, శ్రీ మారుతి ట్రేడర్ ్స రూ.1.24 లక్షల విలువగల ఎరువులను అమ్మకుండా సీజ్ చేసినట్లు తెలిపారు. ఎరువులు అమ్మిన తరువాత రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని తెలిపారు. బిల్లులపై రైతుల సంతకాలు చేయించాలని పేర్కొన్నారు. అనుమతి లేని బయో మందులను విక్రయించరాదని చెప్పారు. బయో మందులు విక్రయించినట్లు తెలిస్తే వారి లైసెను ్సలు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. వీరివెంట మండల వ్యవసాయాధికారి గణేష్, ఏఈఓ నరసింహుడు తదితరులు ఉన్నారు.

# ఐశ్వర్య ప్రదాయిని.. వరలక్ష్మి..

(మొదటి పేజీ తరువాయి)

**ప్రాచుర్యంలోని ఓ పురాణ కథ:** వరలక్ష్మి వ్రతానికి సంబంధించి భారతదేశంలో ఓ పురాణ గాధను చెప్పుకుంటారు.. మగధ దేశంలోని కుండి మండపం అనే పట్టణంలో ఛారుమతి అనే బ్రాహ్మణ స్త్రీ ఉండేది.. ఆమె గుణవతి.. ప్రతిరోజూ భర్తతో పాటు అత్తమామలకు సకల సేవలు చేస్తుండేది.. ఒకరోజు ఛారుమతి కలలో వరలక్ష్మి దేవత ప్రత్యక్షమై.. శ్రావణ శుక్ల పౌర్ణమిలో వచ్చే రెండో శుక్రవారం నన్ను పూజిస్తే కోరిన వరాలు కానుకలు ఇస్తానని అదృశ్యమైంది.. నిద్రలేచిన తరువాత తన కల గురించి తన భర్త, అత్తమామలకు ఛారుమతి చెప్పింది.. గ్రామస్తులకు కూడా తెలియడంతో శ్రావణ శుక్రవారం రోజున గ్రామంలోని స్త్రీలు తలంటు స్నానాలు చేసి, నూతన వస్త్రాలు ధరించి ఛారుమతి ఇంటికి చేరుకుని వరలక్ష్మి దేవికి పూజలు చేస్తారు.. దీంతో చారుమతి గృహంతో పాటు పూజల్లో పాల్గొన్న స్త్రీల ఇళ్లు కూడా ధన, కనక, వస్తు, వాహనాతో నిండిపోయాయనే కథ ప్రచారంలో ఉంది..

**శుక్రవారం వరలక్ష్మికి ప్రీతికరం:** లక్ష్మిదేవిని గురు, శుక్రవారాల్లో ప్రత్యేకంగా పూజిస్తారు.. ఈరోజుల్లో దేవిని ప్రసన్నం చేసుకుని ఆమె ఆశీస్సులు పొందేందుకు వ్రతాలు చేస్తారు..అంతేకాక లక్ష్మిదేవికి ప్రీతికరమైన స్తోత్రాలు, స్తుతులు పఠిస్తారు.. అయితే లక్ష్మి ఆరాధనకు శుక్రవారం మంచిదని భావించడానికి ఓ కారణం ఉంది.. రాక్షసుల గురువు శుక్రాచార్యుడు.. ఈ శుక్రాచార్యుడి పేరుపై శుక్రవారం ఏర్పడిందని పురాణాలు చెబుతున్నాయి..శుక్రాచార్యుడి తండ్రి బృగు మహర్షి.. ఈబృగు మహర్షి బ్రహ్మదేవుడి సంతానంలో ఒకరు. ఇతను లక్ష్మికి దేవికి తండ్రి కూడా..అందుకే లక్ష్మిదేవికి భార్గవి అని పేరు కూడ వచ్చింది.. ఈ విధంగా లక్ష్మిదేవికి శుక్రాచార్యుడు సోదరుడు.. అందుకే శుక్రవారమంటే లక్ష్మిదేవికి ఎంతో ప్రీతికరమైనదని భావిస్తారు.. విష్ణు ఆరాధనలోనూ లక్ష్మిపూజకు ప్రాధాన్యం ఉంది.. లక్ష్మిదేవి అనుగ్రహంతో కాని విష్ణుమూర్తిని దరిచేరలేము.. సదాచారం, సత్రప్రవర్తన లక్ష్మిదేవికి ఆహ్వానాలు.. ఇవి ఉంటే లక్ష్మిదేవి, విష్ణుమూర్తి అనుగ్రహాలను పొందవచ్చని వేదపండితులు తెలుపుతున్నారు..

**వ్రతం ఆచరించే విధానం:** ఏటా శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తారు.. ఆ రోజున అవకాశం లేని వారు అదే మాసంలో పౌర్ణమి తర్వాత కూడా వచ్చే శుక్రవారం రోజుల్లో ఈ వ్రతాన్ని ఆచరిస్తారు.. అదే విధంగా శ్రావణ మాసంలో వ్రతం ఆచరించేందుకు వీలుకాని వారు దసరా నవరాత్రుల్లో నిర్వహించుకుంటారు. భక్తి శ్రద్దలతో వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తే అమ్మవారు సకల సౌభాగ్యాలను కలుగజేస్తుందని మహిళల నమ్మకం.. కాగా వ్రతం నిర్వహించేందుకు ముందు రోజునే మహిళలు తమ ఇళ్లను శుభ్రం చేసి వాకిళ్లకు శుభప్రదంగా మామిడి తోరణాలు కట్టి, పసుపు, కుంకుమలతో సుందరంగా అలంకరిస్తారు..పూజా మందిరం వద్ద ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి మండపంపై బియ్యం పిండితో ముగ్గు వేసి కలశాన్ని ఏర్పాటు చేస్తారు.. అమ్మవారి విగ్రహం, లేదా ప్రతిమ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరిస్తారు.. పూజా సామాగ్రిలో భాగంగా పసుపుతో గణపతి ప్రతిమ, అక్షింతలు తయారు చేస్తారు.. కలశంపై కొబ్బెరకాయ ఉంచి దానిపై వస్త్రాన్ని చుడుతారు.. అమ్మవారి రూపం వచ్చే విధంగా నగలను అలంకరిస్తారు.. పూజలో వినియోగించేందుకు అక్షింతలతో పాటు 9 రకాలు పూలు, 9 రకాలు నైవేద్యాలు, 9 రకాల పత్రిని సమకూర్చుకుంటారు.. ఒకవేళ పత్రి, పూలు అందుబాటులో లేకపోతే వాటి పేరుతోనే అక్షింతలనే అమ్మవారికి సమర్పిస్తారు.. "ఓం శ్రీ మహాలక్ష్మీ దేవ్యే నమ:" అనే మంత్రాన్ని 108 సార్లు భక్తి శ్రద్దలతో పఠిస్తారు.. అదే విధంగా మహాలక్ష్మి అష్టోత్తరం, సహస్ర నామాలతో పూజించి నేవేద్యాలు సమర్పిస్తారు.. పూజా కార్యక్రమానికి వచ్చిన ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, తాంబూలం, తోరణం, గాజులు, శక్తి మేరకు ముఖ్యులకు వస్త్రాలు పెట్టి వారి దీవెనలు పొందుతారు..

**పూజా విధానం:** వరలక్ష్మి ఫోటో ముందు నూతన తెలుపు తుండు పరిచి దానిపై బియ్యం, తమలపాకులు ఉంచి, కలశమును గంధం, కుంకుమలతో అలంకరించి, కలశములో చిల్లర నాణేలు, బంగారం, పసుపు, సుగంధ ద్రవ్యాలు, జలం, పన్నీరు వేస్తారు.. కలశంపై మామిడి మండలు, కొబ్బరికాయ, ఎరుపు రవికే, పుష్పమాల పెట్టి పూజలు చేస్తారు.. దేవతకు నమస్కారం చేస్తూ కొన్ని మంత్రములు జపించి, ప్రాణాయామం చేస్తారు.. జలాన్ని పూజా వస్తువులపై చల్లుతారు.

**ఆరోగ్యం..భక్తి భావం:** వరలక్ష్మి వ్రతం నిర్వహణ భక్తిభావంతో పాటు ఆరోగ్యపరంగా ఎంతో శ్రేయస్కరం.. శ్రావణం తరువాత వచ్చే భాద్రపద మాసంలో కూడా వర్షాలు కురుస్తాయి.. మహిళలు ఏదో ఒక పనితో నీటిలో నడుస్తూ తమ పనులు చేసుకుంటుంటారు.. ఈ క్రమంలో పాదాలు దెబ్బతినకుండా పసుపు పూసుకుంటే యాంటీబయోటిక్‌గా పనిచేస్తుంది.. అదేవిధంగా జలుబు, దగ్గులాంటి వ్యాధులు కూడా దరిచేరవు.. మొలకెత్తిన శనగలను ఈ నెల్లో ప్రసాదంగా తినడం వల్ల శరీరానికి పోషక విలువలతో పాటు వ్యాధి నిరోధక శక్తి కూడా మెరుగుపడుతుంది.. ఈ పండుగ రోజుల్లో ప్రతి స్త్రీ వేకువజామున లేవడంతో పాటు వ్యక్తిగత శుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చి బొట్టు, కాటుక, గంధం, మెట్టెలు, పూలు, కొత్త వస్త్రాలు ధరించి శుభ్రంగా ఉంటారు.. అదేవిధంగా తాంబూలం వేసుకోవడం వల్ల జీర్ణక్రియ సులభతరమవుతుంది..

## వీరుల త్యాగాలను మరువరాదు

**బనగానపల్లెరూరల్, ఆగస్టు4, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య ఉద్యమాలలో ఎందరో వీరులు త్యాగాలు చేశారని వారి త్యాగాలను తరువాతి తరాల వారు ఎన్నటికి మరచిపోకుండా గుర్తుంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలతాదేవి విద్యార్థులకు ఉద్బోదించారు.గురువారం కళాశాల పరిధిలో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలర్పించిన దేశ నాయకుల చిత్రప్రదర్శన విద్యార్థులు నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలతాదేవి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 75సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను నేడు జరుపుకుంటున్నామని కళాశాలలో వివిధ రూపాలలో రోజువారి కార్యక్రమాలు నిర్వహించుకుంటూ త్యాగధనులను స్మరించుకుంటున్నామని ఆమె తెలిపారు.దేశం కోసం తమ విలువైన ప్రాణాలను త్యాగాలు చేసిన త్యాగమూర్తులను మరువరాదన్నారు.ఈ రోజు భారతీయులు స్వేచ్ఛ గాలులు పీల్చడానికి వారే కారకులని తెలిపారు.చరిత్ర శాఖ అధ్యాపకుడు బడేసాహెబ్ మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ నాకు రక్తం ఇవ్వండి నేను మీకు స్వాతంత్ర్య ఇస్తానని అన్నారని గుర్తు చేశారు.బాలగంగాధర్ తిలక్ స్వాతంత్ర్య నా జన్మహక్కు దానిని నేను సాధించి తీరుతాను అన్న మాటలు,భగత్‌సింగ్ జిందాబాద్ నినాదాలు విద్యార్థులకు వివరించారు.సరోజిని నాయుడు,దుర్గాబాయిదేశ్‌ముఖ్,కల్పనాదత్తా లాంటి మహామవులు దేశం కోసం పోరాటాలు చేశారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఉమామహేశ్వరరెడ్డి,సుధాకర్‌రెడ్డి,విజయకుమారి,సూర్యనారాయణరెడ్డి,నరేంద్రనాథ్‌రెడ్డి,రవి,నాగరాజురెడ్డి,వెంకటనారాయణ,వహీదా,కౌసల్యాదేవి,సయ్యద్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గోరంట్ల మాదవ్‌పై అసత్య ప్రచారం చేస్తే సహించబోము

**హొళగుంద, ఆగస్టు 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో కనకశ్రీ యూత్ ఆద్వర్యంలో ఎంపి గోరంట్ల మాధవ్‌పై అసత్య ప్రచారం చేస్తే సహించబోమని కనకశ్రీ యూత్ సభ్యులు అన్నారు. గురువారం కనకశ్రీ యూత్ సభ్యులు కోసిగి లక్ష్మణ్,ఎస్‌కె గిరిలు మాట్లాడుతూ ఎంపి గోరంట్ల మాధవ్‌పై అసత్య ఆరోపణలు చేయడం చాలా తప్పన్నారు. బిసి కులంలో రాజకీయంగా ఎదుగుతుండడం చూసి హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్‌పై కొంతమంది ఓర్వలేక ఇలాంటి వార్తలు మార్ఫింగ్ వీడియో చేసి చానల్‌లో చూపిస్తున్నారన్నారు. మాధవ్ ఒక క్రమశిక్షణ గల డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చారని కాబట్టి రాష్ట్రంలో మాధవవ్‌పేరు చూసి ఎలాగైనా రాజకీయంగా దెబ్బతీయాలని చూస్తున్నారన్నారు. ఎంతమంది ఎన్ని కుట్రలు చేసినా మాధవ్‌ను ఏమి చేయలేరని అరచేతిని అడ్డుపెట్టి సూర్యకిరణాలను ఆపలేరని మాధవ్ ఎదిగేది ఎవరు అడ్డుకోలేరన్నారు. ఈ కార్యక్రమంలో రాము, రవి, రాజు, గోపాల్, రామ్, సోమశేఖర్, వీరేష్, రఘు, నాగేంద్ర, తిప్పన్న, కాంత్ తదితరులున్నారు.

## పింఛన్ల పంపిణీలో బనగానపల్లె ఫస్ట్



**బనగానపల్లెరూరల్, ఆగస్టు4, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా పరిధిలో ఆగస్టు మాసం పింఛన్ల పంపిణీలో బనగానపల్లె ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంపిడివో ఏ.శివరామయ్య గురువారం తెలిపారు.మండలంలో 12,137 పింఛన్ల పంపిణీ చేయాల్సి ఉండగా గురువారం నాటికి 12,030 పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాల అర్బన్ తరువాత బనగానపల్లె మండలంలోనే అత్యధిక పింఛన్ల పంపిణీ జరుగుతుందని తెలిపారు.పేదలకు ప్రభుత్వం చేయూతనిస్తున్న పింఛన్లను సకాలంలో వారికి అందేందుకు తమ సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారని తాము వారికి సరైన మార్గదర్శకాలు అందజేస్తున్నట్లు తెలిపారు.పింఛన్ల పంపిణీలో బనగానపల్లె ప్రథమస్థానంలో నిలవడం తమకు ఆనందదాయకంగా ఉందని ఎంపిడివో శివరామయ్య తెలిపారు.

## దేశభక్తి గేయాలను ఆలపించిన విద్యార్థులు

**బనగానపల్లెరూరల్, ఆగస్టు4, ప్రభాతవార్త:** మండలంలోని వెంకటాపురం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గురువారం దేశభక్తి గేయాలను ఆలపించారు.ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో అధికారుల ఆదేశాల మేరకు రోజువారి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి,ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులచే దేశభక్తి గేయాలను ఆలపింపజేశారు.పలువురు విద్యార్థులు దేశభక్తి గేయాలను చక్కగా పాడి అందరిని ఆకట్టుకున్నారు.విద్యార్థి దశ నుండే దేశభక్తి పెంపొదించడం స్వాతంత్రోద్యమ త్యాగాలు,విలువలను అవగాహన చేసుకోవాల్సిన అవసరం నేటి తరం వారికి ఎంతో ఉందని ఉపాధ్యాయ బృందం తెలిపారు.

## ఎంఎల్‌ఏను ఘనంగా సన్మానించిన విఏఏలు



**మంత్రాలయం, ఆగస్టు 4, ప్రభాతవార్త:** మంత్రాలయం మండలంలో విధులు నిర్వహిస్తున్న విఏఏలు అందరూ గురువారం ఎంఎల్‌ఏ వై.బాలనాగిరెడ్డిని ఘనంగా సన్మానించారు.మండలంలోని విఏఏలు అందరినీ పర్మినెంట్ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించిన సందర్భంగా ఎంఎల్‌ఏను గజమాలతో సత్కరించారు.ఈ ఉద్యోగులు ప్రొబెషన్ డిక్లేర్ అయ్యి రెగ్యులర్ పేస్కేల్ అందుకున్న సందర్భంగా ఎంఎల్‌ఏను సత్కరించారు.మా ఉద్యోగాలను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రతను కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ ఋణపడి ఉంటామని ఉద్యోగులు పేర్కొన్నారు.మీమీ గ్రామాల్లో రైతులకు మీ విలువైన సేవలు అందించినప్పుడే మీ ఉద్యోగానికి గుర్తింపు వస్తుందని ఎంఎల్‌ఏ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గణేష్,ఏఈఓ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల విశిష్టతపై ర్యాలీ..

**కోసిగి, ఆగస్టు 4, ప్రభాతవార్త :** తల్లిపాలల్లో ఎంతో పోషకాలు ఉంటాయని, పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టించాలని కోరుతూ గురువారం కోసిగిలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గురుశేఖరమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.. కోసిగిలోని ఎన్‌టీయార్ కాలనీలో ఉన్న 9వ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో 8, 10, 11, 12, 13, 14, 15, 18, 19 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబందించిన కార్యకర్తలు, తల్లులు, బాలింతలతో తల్లిపాలపై అవగాహన కల్పించి వారికి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి కార్యక్రమాన్ని నిర్వహించిడం జిరిగింది.. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ ప్రతి గర్భిణి తనకు పుట్టబోయే బిడ్డ భవిష్యతును దృష్టిలో ఉంచికుని పిల్లలు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టిస్తే పిల్లలకు ఎలాంటి వ్యాధులు రావన్నారు.. అనందరం ఆశావర్కర్ సుజాత పలు సూచనలు చేసారు.. ఈ కార్యక్రమంలో శైలజ, లూసమ్మ, వరలక్ష్మి, జ్యోతి, దేవి, నాగలక్ష్మి, భీమలింగమ్మ, లత, నాగవేణి, వెంకటమ్మ, అంగన్‌వాడీ ఆయా సత్యకళ, తల్లులు, బాలింతలు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు..

## సీనియర్ సహాయకులు రమణయ్య అకస్మికమృతి

**పగిడ్యాల, ఆగస్టు 4, ప్రభాతవార్త :** పగిడ్యాల మండలం సంకిరేణిపల్లెకు చెందిన సీనియర్ సహాయకులు గోపాలదాసుల రమణయ్య (56) అకస్మికంగా బుధవారం మృతిచెందారు. రమణయ్య స్వగ్రామమైన సంకిరేణపల్లెకు గురువారం అయన భౌతికఖాయం తరలించారు. గోపాలదాసుల రమణయ్య సీనియర్ సహాయకులుగా ఎస్‌అర్‌బిసీ నంద్యాలలో సర్కిల్ -1. సబ్‌డివిజన్- 2 పాణ్యంలో పనిచేస్తున్నారు, రమణయ్య అనారోగ్యానికి గురికావడంతో కర్నూలు ప్రైవేటు అసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతి వార్త తెలియగానే భార్య వెంకటేశ్వరమ్మ, కూతుళ్లు రాధమ్మ, శ్రావణి, కుమారుడు కృష్ణసాయి, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం తెలుసుకున్న నంద్యాల సర్కిల్ -1, పాణ్యం సబ్‌డివిజన్ -2 డీఈ వెంకటేశ్వరెడ్డి, సీనియర్ సహాయకులు నాగేంద్రప్ప, నిరంజన్, గుంపుల చెన్నయ్య, రమేష్, ప్రభాకర్, దివాన్, రమణయ్య స్వగ్రామం చేరుకుని అయన బౌతికఖాయాన్ని సందర్శించి పూలమాలువేసి నివాళ్ళుఅర్పించారు. రమణయ్య అకస్మికమృతి తమను కలిచివేసిందనీ సీనియర్ సహాయకులు గుంపుల వెంకటేశ్వర్లు విచారం వ్యక్తం చేశారు. అయన మృతికి సంతాపం ప్రకటించి, కుటుంభస్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

## ప్రతిఇంటికి ప్రభుత్వ పథకం

**- ఎమ్మెల్యే హాఫిజ్‌ఖాన్**

**కర్నూలు ఆగస్టు 4, ప్రభాతవార్త ప్రభాతవార్త:** ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకం అందుతుందని ఎమ్మెల్యే హాఫిజ్‌ఖాన్ అన్నారు. గురువారం 41వ సచివాలయం నందు మారుతిహోమ్స్ నుంచి సప్తగిరి నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రజల దగ్గరకు వెళ్లి ప్రభుత్వం యొక్క పనితీరు, సమస్యలపై ప్రజలనడికి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి ఏ రూపాలలో అందాయో అడిగి తెలుసుకున్నారు. ఎల్‌బిజి నగర్‌లో ఉన్న కాల్వల సమస్య నీటి సమస్యల తదితర ముఖ్య అంశాలపై ప్రజలు ఇచ్చిన సూచనలు, సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కైప పద్మలతరెడ్డి, సుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపాలిటి సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



## అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పీర్ల పండుగ నిర్వహించుకోవాలి

**పత్తికొండ, ఆగస్టు4, ప్రభాతవార్త:** పత్తికొండ మండలంతోపాటు పట్టణంలో నిర్వహించే పీర్ల పండుగ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని అర్బన్ సీఐ మురళీమోహన్ ప్రజలను కోరారు.కులం,మతం బేధాలు లేకుండా ముస్లింలతోపాటు హిందువులు కూడా పీర్ల పండుగను జరుపుకుంటారని పీర్ల పండుగ హిందువు,ముస్లింల ఐక్యతకు ప్రతీక అని ఆయన తెలిపారు.ఇటువంటి పండుగలో అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.గ్రామాల్లో పండుగ సమయాల్లో అల్లర్లకు,ఘర్షణలకు పాల్పడితే అటువంటి వారి పై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.పట్టణంలో యువకులు మద్యం సేవించి ద్విచక్ర వాహనాల పై త్రిబుల్ రైడింగ్ చేసినా,ద్విచక్ర వాహనాలకు పెద్ద పెద్ద శబ్దాలు వచ్చే సైలెన్సర్లను వాడితే అటువంటి వారి పై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.పట్టణంలోని ఆయా వీధుల్లో ఉన్న పీర్ల చావిడిల వద్ద ఉండే గుండం వద్ద ప్రజలు,భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## డయల్ యువర్ ఎస్‌ఈకి 13 ఫిర్యాదులు



**కర్నూలు జిల్లా పరిషత్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** డయల్ యువర్ ఎస్‌ఈ కార్యక్రమానికి 13 ఫిర్యాదులు వచ్చినట్లు ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్‌ఈ కె.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయంలో విద్యుత్ సమస్యలపైనిర్వహించిన డయల్ యువర్ ఎస్‌ఈకి ఫోన్ల ద్వారా 13 ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. అందులో ప్రధానంగా బిల్లింగ్‌కు సంబంధించి 2, విద్యుత్ లైన్‌కు సంబంధించి 5, మీటర్ సమస్యపై1, విద్యుత్ సప్లైకు సంబంధించి 1, విద్యుత్ అంతరాయంకు సంబంధించి 2, వ్యవసాయంకు అందించేవిద్యుత్ సమస్యపై 1, ఇతర సమస్యలపై మరో ఫిర్యాదు అందినట్లు పేర్కొన్నారు. వీటికి సంబంధించిసంబంధిత అధికారులకు సూచించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈతోపాటు ఎడి.వి.భాస్కర్ పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలి - ఎమ్మార్పీఎస్

**కొత్తపల్లె, ఆగస్టు4, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ పై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్దత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు నాగరాజు అన్నారు.గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మందల కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణచేసి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్దత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని వారు పేర్కొన్నారు.అలాగే వచ్చే ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్‌ల సత్తా ఏమిటో చాటి చూపుతామని వారు పేర్కొన్నారు.అలాగే వచ్చే ఎన్నికల్లా ఎస్సీ వర్గీకరణ పై పార్లమెంట్ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్దత కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో దాసు,రాజు,రంజిత్,ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రాజకీయంగా ఎదుర్కోలేక.. అసత్య ప్రచారాలు చేస్తున్నారు

**- ఎంపికి వైఎస్సార్‌సిపి విద్యార్థి సంఘం సంపూర్ణ మద్దతు**

**కర్నూలుక్రైం, ఆగస్టు4, ప్రభాతవార్త:** రాజకీయంగా ఎదుర్కోలేక హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్ పై ఫేక్ వీడియోలు ప్రచారం చేసి బిసిలను అణగదొక్కుతున్నారని వైసీపీ విద్యార్థి సంఘం,బిసి చైతన్య సంఘాలు ఆవేదన చెందాయి.ఈ మేరకు గురువారం నగరంలోని స్థానిక వైఎస్సార్‌సిపి కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కురువ శిశ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బిసి చైతన్య సమితి జిల్లా అధ్యక్షులు సుమంత్ ఆచారి,ప్రజారక్షణ సమితి వ్యవస్థాపకులు బలరామ్ హాజరై మాట్లాడారు.హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్ పై అసభ్య ప్రచారం చేస్తున్న వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఇందులో జరుగుతున్న రాజకీయ కుట్రలు తిప్పకొడతామని ఆగ్రహం వ్యక్తం చేశారు.బిసి ఎంపి గోరంట్ల మాధవ్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కుట్రలు చేయడం దుర్మార్గమన్నారు.వాస్తవాలు కప్పిపెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అలాంటి వారి పై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదుచేసి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి యూనియన్ జిల్లా సెక్రటరీ గిరీష్,నాయకులు కిరణ్,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీ నిర్వహకులకు అనుమంతి పత్రం అందజేస్తున్న అధికారులు



**గోనెగండ్ల ఆగస్టు 4 ప్రభాతవార్త :** నర్సరీలు నిర్వహకులు ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాలని ఉద్యానవన శాఖ అధికారులు రామంజినేయులు, శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారులు రామంజినేయులు,శ్రీవాణిలు మాట్లాడుతూ నర్సరీ రైతులకు నర్సరీ లైసెన్స్ అందజేశారు.ఉద్యాన నర్సరీలను నిర్వహించే నర్సరీ యజమానం గురించి కుడ వివరించడం జరిగింది.గోనెగండ్ల గ్రామంలో బంతిపూలు,చామంతి పూల పంటలను సందర్శించారు.వారికి పంటపై సూచనాలు ఇవ్వడం జరిగింది. అలాగే పంట పై సబ్సిడిల గురించి రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో నర్సరీల యజమానులు,రైతులు,ఉధ్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్టపాశంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం

**గోనెగండ్ల ఆగస్టు 4 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పుట్టపాశం గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ తరపున లేగదూడల ప్రదర్శన,ఉచిత పశువైద్య శిభిరం నిర్వహించారు.కర్నూలు డివిజన్ ఉపసంచాలకులు డా.దుర్గా ప్రసన్నబాబు,లేగ దూడల యజమాన్యలకు, టీకాలు గురించి వివరించారు.నేటి దూడలే రేపటి ఆవులు కావున లేగదూడలు జబ్బు పడకుండా పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తపడాలని కర్నూలు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఇ ఓ డా.రాజశేఖర్ తెలిపారు.లేగదూడులు అన్నింటికి నట్టలనివారణ మందులను త్రాపి తగిన వైద్యం అందించడ ం జరిదింది.లేగదూడల ప్రదర్శనలో మేలు జాతి ఆరోగ్యంగా ఉన్న దూడలను గుర్తించి వారి యజమానులకు బహుమతులను ఇవ్వడం జరిగింది.ఈకార్యక్రమంలో గోనెగండ్ల మండల వైద్యశాల సహాయసంచాకులు డా.వెంకటేశ్వర్లు,పుట్టపాశం గ్రామ సర్పంచ్ నరసింహరెడ్డి,గ్రామ పెద్దలు సూర్య నారాణరెడ్డి,పశువైద్యసహాకులు శస్త్రచికిత్సకులు డా. మహమ్మద్ ఆలీ,డా. వీరేష్,పశువైద్య సిబ్బంది,పాడిరైతులు,ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన పెట్టేల మహోత్సవాలు

**కోవెలకుంట్ల, అగస్టు 4, ప్రభాతవార్త :** మోహరమము వేడుకలు అరంభము కావడము తో పెట్టేల ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు ముస్లీంలు. అందులోబాగంగా గురువారమ రాత్రి పద్దెబారము చావిడి వద్ద పీర్లను ఏరేగిస్తు పెట్టేల ఉత్సవాలను ఏర్పాటు చేశారు. వీటిని కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని ప్రార్థలు చేశారు. అందులో బాగంగా మాజీ మార్కెట్: యాడు చైర్మన్ గడ్డంనాగేశ్వరరెడ్డి ఏటా మాదిరిగనే ఈసారి కూడా పెట్టేల ఉత్సవాల్లో పాల్గొని ముస్లీంలతో పాటు ప్రార్థనలు చేశారు.



## ఎమ్మార్పీఎస్ దీక్షకు రాష్ట్ర నాయకులు మద్దతు

**పత్తికొండ, ఆగస్టు 4, ప్రభాతవార్త :** ఏబిసిడి వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు తిరుపాల్,వెంకటేశ్వర్లు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. గురువారం స్థానిక నాలుగు స్థంబాల మండపం వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్న వారికి వారు పూలమాలలు వేసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మందాకృష్ణ మాదిగ చేపట్టిన నిరాహార దీక్షలకు సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తున్నామన్నారు. ఎమ్మార్పీఎస్ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్,ఈశ్వరయ్య, రవికుమార్,రాముడు,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతోనే ప్రతిఒక్కరికి ప్రశాంతత



**ఆస్పరి, ఆగస్టు 4, ప్రభాతవార్త :** ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతిఒక్కరికి ప్రశాంతత చేకూరుతుందని కర్ణాటక రాష్ట్రం కల్లుబోలే మఠం పీఠాధిపతి చెన్నవీర శివాచారి మహాస్వాములు అన్నారు. గురువారం మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో కాళికాదేవి,వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణంలో రూ.1కోటి50లక్షలతో నిర్మించిన నూతన గదుల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ముందుగా నూతన గదుల నిర్మాణ దాతలు స్థానిక రథోత్సవ సత్రం నుండి 15కళశాలు,15బిందెలతో వీరభద్రస్వామి దేవాలయం వరకు ఊరేగింపుగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం,గంగపూజ,గోపూజ,మహామంగళారతి తదితర పూజలు నిర్వహించారు. గదుల ప్రారంభోత్సవాన్ని మఠం పీఠాధిపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతిఒక్కరికి మనసు ప్రశాంతత కలుగుతుందన్నారు. అందరు ఆధ్యాత్మికను అలవరచుకోవాలని ఆయన సూచించారు. అలాగే చిగిలి గ్రామానికి నాగలింగయ్య స్వామి వీరభద్రస్వామి వేషాధారణ వేసి ప్రజలను ఆకట్టుకున్నాడు. విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చోళే మల్లికార్జున, గంగాదరయ్యస్వామి, ప్రసాద్,వీరేష్,గ్రామపెద్దలు తదితరులున్నారు.

## తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీయస్పీకి వినతి

**ఆదోనిలీగల్, ఆగస్ట్04, ప్రభాతవార్త ;** సోషల్ మీడియా వేదికగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదారి పట్టించేలా ఎన్టీ రామారావు చిన్నకుమార్తె ఉమామహేశ్వరి మరణాన్ని దుష్ప్రచారం చేసుత్ను వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, వైఎస్సార్సీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దేవేందర్‌రెడ్డిపై కేసులు నమోదు చేయాలని టీడీపీ నాయకులు డీయస్పీ వినోద్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు గురువారం డీయస్పీకి రాత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. తెలుగు విద్యార్థి, తెలుగు మహిళా విభాగం, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి బసాపురం వెంకటేష్‌చౌదరి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌నాయుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, తేజ, మహిళా కార్యదర్శి అంజనమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుష్ప్రాచారాలతో ప్రజలను వైసీపీ నాయకులు మభ్య పెడుతున్నారన్నారు. ఇలాంటి వాటిని ఎప్పటికప్పుడు ఖండించాలన్నారు. పొంతనలేని ప్రచారాలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

**ఆదోనిలీగల్, ఆగస్ట్04, ప్రభాతవార్త ;** తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావతి అన్నారు. ఈ మేరకు గురువారం మహాత్మాగాంధీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం 81లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల వారోత్స వాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పాలు, గుడ్లు, మంచి పౌష్టికాహారం అందిస్తుందన్నారు. బాలింతలు తల్లిపాలనే బిడ్డలకు అందించాల న్నారు. తల్లి, బిడ్డ పౌష్టికంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## ప్రారంభమైన మొహర్రం వేడుకలు

**కౌతాళం, ఆగస్ట్04, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన కౌతాళంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం పీర్ల దేవుళ్ల కొలువుదీ రారు. భక్తులు పీర్లదేవుళ్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చు కున్నారు. కౌతాళంలో మొహర్రం పండగ సందర్భంగా పీర్ల దేవుళ్లను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కౌతాళం ఖాదర్‌లింగస్వామి పీఠాధిపతి సయ్యద్‌మున్నాసాహెబ్, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ, ముస్లీంలు మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం పండగను జరుపుకుంటామని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్లకు పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

## వలసలలో 'పిడుగు'

**: ఇటీవల వివాహం అయిన మహిళ దుర్మరణం**

**: అదే కుటుంబంలోని మరో ముగ్గరికి షాక్**



**డోన్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** డోన్ మండలంలోని కొండప్రాంత గ్రామమైన వలసలలో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు ఒక కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి. ఒకటే కుటుంబానికి చెందిన చిన్న పూజిత అనే 19ఏళ్ళ మహిళ తీరని షాక్‌కు గురై చికిత్సకు తరలించేలోగా మృతిచెందారు. అదే కుటుంబానికి చెందిన చిన్న వెంకటేశ్వర్లు, ఆయన భార్య లక్ష్మిదేవికి తీవ్రగాయాలై అపస్మారిక స్థితిలోకి వెళ్లిపోయారు. మెరుగైన వైద్యంకోసం డోన్‌లో ప్రాథమిక చికిత్సచేసిన అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... చీకటి పడే సమయంలో పొలంపని ముగించుకుని ఇంటికి వెల్దామని అనుకుంటుండగా ఉరుములు, మెరుపులతో వర్షం రావడంతో వర్షం తాకిడిని తట్టుకోలేక చెట్టుకిందకు దాక్కునేందుకు అందరూ కలసి వెళ్లారు. ఉన్నఫలంగా ఒక్కసారిగా చెట్టుపై పిడుగు (విద్యుత్ వలయం)భూమిని తాకడంతో అక్కడ దాక్కునవారంతా షాక్‌కు గురయ్యారు. చికిత్సకోసం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం అందించేలోగా పూజిత మృతిచెందినట్లుగా డాక్టర్లు ధృవీకరించారు. గాయపడ్డ వెంకటేశ్వర్లు, ఆయన భార్య లక్ష్మిదేవిల పరిస్థితి విషమంగా వుండటంతో కర్నూలు వైద్యశాలకు తరలించారు.

**పాపం పూజిత...పెళ్ళై 2నెలలు...**

పిడుగుపాటుకు మృతిచెందిన పూజితకు గత మే నెలలో వివాహం జరిగింది. డోన్ మండలంలోని దర్మారం గ్రామానికి చెందిన పూజితను రెన్నెళ్ళక్రితం వలసలలోని చిన్నవెంకటేశ్వర్లు కుమారుడికి ఇచ్చి వివాహం జరిపారు. కేవలం రెండు నెలల వ్యవదిలోనే ఆమె మృత్యుఒడికి చేరడంతో భర్తతోపాటు పుట్టినిల్లు దర్మారంకు చెందిన తల్లిదండ్రులు పడుతున్న వేదలన చూపరుల హృదయాలను కలచివేసింది. పరామర్శించిన దేశం నేతలు: గాయపడ్డ చిన్నలచ్చి వెంకటేశ్వర్లు, ఆయన భార్య లక్ష్మిదేవిలు డోన్ ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్సను చేసారు. విషయం తెలిసిన వెంటనే వలసల గ్రామానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి మాజీ జడ్పీటిసి వలసల రామక్రిష్ణతోపాటు టిడిపి మండల అధ్యక్షులు సలీంద్ర వెంకటేశ్వర్లు, తెలుగుయువత డోన్ నియోజకవర్గ అద్యక్షులు గార్లదిన్నె సుదాకర్ తదితరులు వైద్యశాలకు వెళ్లి గాయపడ్డ వారిని పరామర్శించారు.

## కాసీం సాహెబ్ మృతి పార్టీకి తీరనిలోటు

**దేవనకొండ,ఆగస్టు 4,ప్రభాతవార్త :** దేవనకొండలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,మాజీ కోఆప్షన్‌మెంబర్ కాసీం సాహెబ్ మృతి పార్టీకి తీరనిలోటు అని మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం టిడిపి సీనియర్ నాయకులు,మాజీ కోఆప్షన్‌మెంబర్ కాసీంసాహెబ్ అనారోగ్యం కారణంగా చనిపోవడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి వారి స్వగృహానికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ కాసీం సాహెబ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత 40సం॥ల నుంచి పార్టీలోనే ఉంటూ పార్టీ కోసం శ్రమిస్తూ ఎనలేని కృషి చేశారని ఆయనకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఆయన మాట్లాడుతూ వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపుతూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దేవనకొండ టిడిపి కుటుంబ సభ్యుల్లో ఒక మంచి వ్యక్తిని కోల్పోయామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వినర్ విజయభాస్కర్‌గౌడ్,దేవనకొండ టిడిపి సీనియర్ నాయకులు మల్లయ్య, ఆకుల వీరేష్,బడిగింజల రంగన్న,బండ్లయ్య,మల్లికార్జునగౌడ్, రాజశేఖర్‌గౌడ్, కార్యకర్తలు మరియు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ టి.షడ్రక్‌కు నివాళులు



టి.షడ్రక్ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న సిపిఎం

**కోడుమూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త :** దివంగత కామ్రేడ్ టి.షడ్రక్ రెండవ వర్ధంతి సందర్భంగా కోడుమూరు సిపిఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయం సుందరయ్య భవన్ లో పార్టీ మండల కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయుకులు, కార్యకర్తలు గురువారం కామ్రేడ్ షడ్రక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గఫూర్ మియ్యా మాట్లాడుతూ కామ్రేడ్ షడ్రక్ జిల్లాలో అలుపెరగని పోరాటాలు ఎన్నో చేశారని చెప్పారు. పేద, బడుగు వర్గాల కోసం భూ పోరాటాలు చేశారని, కార్మికుల, రైతుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టారనిఆయన తెలియజేశారు. అలాంటి నాయకుడు ప్రజల మధ్య లేకపోవడం చాలా బాధాకరమని, ఆయన ఆశయ సాధన కోసం తామంతా నిరంతరం శ్రమిస్తామని ఆయన పేర ్కన్నారు. అనంతరం షడ్రక్ వర్ధంతిని పురస్కరించుకొని సిపిఎం నాయకులు పేదలకు అన్నదానం చేశారు.కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె.లక్ష్మన్న, ముడువలగుర్తి సర్పంచ్ మల్లేష్, సిపిఎం సభ్యులు బండా శేఖర్, బి.రాజు, జి.గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిడ్డకు..అమ్మపాలు అమృతం : సిడిపిఓ లలిత

**హొళగుంద,ఆగస్టు 4,ప్రభాతవార్త :** అప్పుడే పుట్టిన బిడ్డకు అమ్మపాలు అమృతమని ఆలూరు సిడిపిఓ లలిత అన్నారు. గురువారం మండల పరిధిలోని హెబ్బటం గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రం-5 నందు సిడిపిఓ లలిత అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఓ లలిత,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శిభారాణి,104హెల్త్ సిబ్బంది మరియు ఆశాలు గ్రామ పురవీధుల గుండా తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిడిపిఓ లలిత మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని జరపాలని సూచించారన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లిపాలు(ముర్రుపాలు) ఇవ్వాలని,బిడ్డకు ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే ఇవ్వాలన్నారు. ఆరు నెలలు నిండిన తర్వాత తల్లిపాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వాలన్నారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం



సిడిపిఓ లలిత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

వల్ల ఆరు నెలల్లోపు గర్భం దాల్చే అవకాశం ఉండదని ఇది సహజ కుటుంబ నియంత్రణ పద్ధతి ఉపయోగపడుతుందన్నారు. తల్లిపాలు పుష్కలంగా రావాలంటే గర్భిణిగా ఉన్నప్పటి నుండి పోషక విలువలు ఉన్న ఆహారం పాలు,చేపలు,గుడ్లు,తాజా కూరగాయలు,పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి కార్యకర్తలు సుజాత,పారిజాత,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న సర్పంచ్,సచివాలయ ఉద్యోగులు

**తుగ్గలి,ఆగస్టు 4,ప్రభాతవార్త :** మండల పరిధిలోని శభాష్‌పురం గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి గురువారం సచివాలయ ఉద్యోగులు,సర్పంచ్ పుష్పావతి,మాజీ సర్పంచ్ హనుమంతుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుష్పావతి,మాజీ సర్పంచ్ హనుమంతులు మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సచివాలయ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేసి వారికి ఆగస్టు 1వ తేదీన కొత్త జీతాలు ఇవ్వడం జరిగిందన్నారు. అందువల్ల సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేవిధంగా చూస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి,ఎమ్మెల్యే శ్రీదేవమ్మకు మంచి పేరు తీసుకురావాలని వారు తెలిపారు. పలువురు స్థానిక వైసిపి నాయకులు,సచివాలయ ఉద్యోగులు,వాలంటరీలు పాల్గొన్నారు.

## దత్తాత్రేయస్వామివారికి విశేష పూజలు

**శ్రీశైలంప్రాజెక్టు,ఆగస్టు04,ప్రభాతవార్త :** లోకకల్యాణంకోసం దేవస్థానం గురువారంనాడు ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీదత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించడం జరిగింది.కాగా దేవస్థానసేవగా(సర్కారిసేవగా)ఈ కైంకర్యం జరిపించబడింది.ఈ పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహగణపతిపూజను జరిపించబడింది.ఆ తరువాత దత్తాత్రేయసా ్వమివారికి పంచామృతాభిషేకం,విశేష పూజలు నిర్వహించబడ్డాయి.లోకోద్ధరణకోసమై బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ఒకే ్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు.అందుకే త్రిమూర్తి స ్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్దుడు.కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది.ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి.అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు.కాగా



పూజలో పాల్గొన్న ఈఓ లవన్న

దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు.వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది.

## రూ.42 లక్షలతో నాడు-నేడు పనులు ప్రారంభం

**నందికొట్కూరు,ఆగస్టు 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.42 లక్షలతో నాడు-నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులకు సర్పంచ్ రవికుమార్ యాదవ్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ప్రస న్నలక్ష్మి మాట్లాడుతు నాడు-నేడు కింద రూ.42 లక్షలతో వంట గది, విద్యార్థులకు టాయిలెట్స్, వరండాకు గ్రిల్సు, ఎలక్ట్రికల్ వర్క్, త్రాగునీరు, మైనర్ రిపేర్లు, పాఠశాలకు రంగులు వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అబుబకర్, విద్యాకమిటీ చైర్మన్ తిరుపతయ్య, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్

## దేవేంద్రరెడ్డిపై కఠిన చర్యలు చేపట్టాలి

**మంత్రాలయం,ఆగస్టు 4,ప్రభాతవార్త:** టిడిపి జాతీయ అధ్యక్షులు,జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు దేవేంద్రరెడ్డి,రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిపై కఠిన చర్యలు చేపట్టాలని టిడిపి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు నరవ శశిరేఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం మంత్రాలయంలో స్థానిక పన్నగ హోటల్ నుండి ర్యాలీగా వెళ్ళి ఎస్ఐ వేణుగోపాల్‌రాజుకు వినతిపత్రం అ ందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి కూతురు ఉమా మహేశ్వరి మృతికి చంద్రబాబు,నారా లోకేష్‌లు కారణమని తప్పుడు ప్రచారం చేస్తూ శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.కాబట్టి వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు దివాకర్‌రెడ్డి,మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్,నాగసేన స్వామి,అమర్‌నాథ్‌రెడ్డి,సుధాకర్‌రెడ్డి,జిల్లా మహిళాకార్యదర్శి నాడుగేని నర ్సమ్మ,సరోజమ్మ,వట్టెప్ప నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

## ఈనెల 16వ తేదిలోపల ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్, విజిలెన్స్ నియామకం కొరకు ధరఖాస్తు

**నంద్యాల విద్య, ఆగస్టు 4, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా పరిధిలో ఎస్సీ, ఎస్టీకి చెందిన అర్హులైన నాయకులు జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీలో సభ్యులను నియమించుకోవడానికి ఈనెల 16 తేదీలోపల ధరఖాస్తులు చేసుకోవచ ్చని జిల్లా ఎస్సీ సంక్షేమ సంఘం సాధికారిత అధికారిణి చింతామణి ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి సమాజసేవ యందు పేరుప్రఖ్యాతులు గడించివారై ఉండాలి. సేవా తపనతో పనిచేయాలనే అలోచన ఉండాలి. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, దేశస్థాయిల్లో అవార్డులు పొందినవారికి ప్రభుత్వంచే గుర్తింపు పొందిన వారికి ఎంపిక ప్రక్రియ నందు ప్రాముఖ్యత ఇవ్వబడును. కమిటీ పరిశీలించిన పిదప ఐదు మందిని ఎంపికచేసుకుంటారు. ఈపదవి కాలం రెండు సంవత్సరాలు, ఈ పదవిలో గతంలో రెండుపర్యాయాలు కమిటీ సభ్యులుగా పనిచేసిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులు. ఎస్సీ, ఎస్టీలే కాకుండా ఇతర కులాలకు చెందిన వారికి కూడ ముగ్గురిని ఎన్‌జిఓస్ వారు ఎస్సీ, ఎస్టీ, బిసి తెగల కొరకు సేవలు అందిస్తున్నవారిని కూడ కమిటీ సభ్యులుగా తీసుకుంటారు. అర్హులైన వారు దరఖాస్తులను జిల్లా ఎస్సీ కార్యాలయం పొన్నాపురం కాలనీ నందు ఉన్న కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తులతో పాటు విశిష్టసేవలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు అందజేయాలని పేర్కొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి సహకరించండి

**చిలకలడోణ(మంత్రాలయం),ఆగస్టు 4,ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిలకలడోణ ఎంపిపి పాఠశాల అభివృద్ధి కోసం అందరూ సహకరించాలని ప్రధానోపాధ్యాయురాలు సరళాదేవి,విద్యాకమిటీ చైర్మెన్ రంగన్న పిలుపునిచ్చారు.గురువారం స్థానిక పాఠశాలలో పేరెంట్ ్స కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య,మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రభుత్వం విద్యకు తొలి ప్రాధాన్యం ఇస్తూ అమ్మఒడి,జగనన్న గోరుముద్ద,నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి తదితర సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు.పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి దృష్టికి తెలియజేస్తే సమస్యలు పరిష్కరించబడతాయని వెల్లడించారు. ఉపాధ్యాయులు భీమన్న,కృష్ణవేణి,శ్రీవిద్య,పావని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు

## మాజీ యంపిపి భర్తను పరామర్శించిన బిసి సోదరులు

**సౌదరదిన్నె(కోవెలకుంట్ల)ఆగస్టు 4,ప్రభాతవార్త :** కోవెలకుంట్ల మండల మాజీ యంపిపి భర్త సౌదరదిన్నె నివాసి చెలమకూరి సుబ్బారెడ్డి బిసి సోదరులు పరామర్శించారు. ఇటీవల అయన అరోగ్యము సరిగా లేక పోవడము అసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు.దీనితో గురువారము బిసి సోదరులు బనగానపల్లె మాజీ సర్పంచ బిసి రాజారెడ్డి, బిసి బాలతిమ్మారెడ్డి బిసి అమరనాదరెడ్డిలు అయన సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లి అరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.



సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న బిసి సోదరులు

## శ్రీగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు

**శ్రీశైలంప్రాజెక్టు,ఆగస్టు04,ప్రభాతవార్త :** శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా(నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా)గురువారంనాడు శ్రీ వెంకటేశ్వర సంగీత నిలయం కర్నూలు వారిచే భక్తి సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఆలయ దక్షిణ మాడవీదిలోని నిత్యకళారాధన వేదిక వద్ద కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో గణపతి ప్రార్ధన,శంభో శివ శంభో,శ్రీశైలవాస,తదితర గీతాలకు బి.నాగమల్లేశ్వరి,ధరణి,గాయిత్రీ,శ్రీవల్లి, అలాపించారు. శ్రీసా ్వమిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ ధర్మపథం కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## ఆస్పరి సహకార బ్యాంకు అభివృద్దికి చేస్తా

**ఆస్పరి,ఆగస్టు 4,ప్రభాతవార్త :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జయరాం సహకారంతో ఆస్పరి సహకార బ్యాంకు అభివృద్దికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధ ్న అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఆస్పరిలో స్థానిక సొసైటీ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ గోవర్ధన్,డైరెక్టర్లు శ్రీనివాసులు,రంగన్నలు భాద్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో కష్టపడి పనిచేసే వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. ఆలూరు నియోజకవర్గంలో మంత్రి గుమ్మనూరు జయరాం సహకారం ఉండడంతో బిసిలకు సముచిత స్థానం కల్పించడం చాలా సంతోషదాయకమన్నారు. తాను రైతు కుటుంబం నుండి వచ్చానని రైతు సమస్యలపై తమకు అవగాహన ఉందని సొసైటీ ద్వార చిన్న,సన్నకారు రైతులకు పంట రుణాలు,బ్యాంకు లోన్‌లు అందిస్తామన్నారు. ప్రతిరైతుకు అందుబాటులో ఉంటూ బా ్యంకు అభివృద్దికి కృషి చేస్తామన్నారు. అనంతరం సొసైటీ సిఈఓ అశోక్,అటెండర్లు నరసింహులు,ఉషారాణి,సిబ్బంది కలిసి వారికి శాలువా,పూలమాలతో సన్మానం చేశారు.

## " వామ్మో ఢీజల్ దొంగలు .." - వాహనలు బయట పెట్టారో అంతే సంగతులు



ట్రాక్టర్ క్యాపులు తొలగించి ఢీజల్ ఎత్తుకెళ్లిన దుండుగలు

**కొలిమిగుండ్ల, ఆగస్టు 4, ప్రభాతవార్త :** కొలిమిగుండ్ల మండలంలో ఢీజల్ దొంగలు హల్‌చల్ సృష్టిస్తున్నారు. బయట పార్కింగ్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకొని దొరికినంత ఢీజల్ ఎత్తు కెళ్తున్నారు. తాజాగా మండలంలోని కల్వటాల గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే పార్కింగ్ చేసిన వాహనాల్లో 300లీటర్లు ఢీజల్ ఎత్తుకెళ్లినట్లు బాధితులు పెర్కొన్నారు. పార్కింగ్ చేసిన నాలుగు ట్రాక్టర్లు, ఒక రోలర్ వాహనంలో నిల్వవున్న సుమారు 300లీటర్లకు పైగా ఢీజల్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధుతులు అమర్ నాథరెడ్డి, గోపాల్‌రెడ్డి, జయన్న, నరసింహ తదితరులు వాపోయారు. మరోవైపు మండలంలోని కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె, బెలుం తదితర గ్రామాల్లోనూ ఇంటి పరిసరాల్లో పార్కింగ్ చేసిన వాహనాల్లో ఢీజల్ ఎత్తు కెళ్లిన సంఘటనలు గతంలోనూ అనేకం చోటు చేసుకున్నాయి. చిన్న చిన్న దొంగతనాలు అనే ఉద్దేశ్యంతో పోలీసు అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం దొంగలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది.

## ప్రైవేట్ పాఠశాలలో ఆర్టీఇ చట్టం ప్రకారం 25 శాతం సీట్లు - కమిషనర్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ

**నంద్యాల విద్య, 05, ఆగస్టు 4, ప్రభాతవార్త:** ఉచిత నిర్బంద విద్యాహక్కు చట్టం సెక్షన్ 12 (1) సి అనుసరించి 2022-23 విద్యాసంవత ్సరానికి అన్ని రాష్ట్రంలోనే అన్ని ప్రైవేట్, అన్ఎయిడెడ్ పాఠశాలల్లో పేద పిల్లలకు 25 శాతం సీట్లు లాటరీ పద్దతిలో ఎంపికచేసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ ప్రత్యే ్యక ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఉచిత నిర్బంద విద్యకు బాలల హక్కుచట్టం 2009 మేరకు జిఓ నం.129 ప్రకారం ఈసీట్లను కేటాయించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద కుటుంబాలకు వార్షిక ఆదాయం 1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో నివశించేవారికి రూ.1.40 లక్షలు ప్రాతిపదికన తీసుకొని పూర్తిచేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో అనాధ పిల్లలు, హెచ్ఐవి బాధిత పిల్లలు, దివ్యాంగుల వారి కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బిసి, మైనార్టీ ఓసిలకు 6 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 10న ప్రచురణ విడుదల చేయాలని 16వ తేదిన అన్‌లైన్‌లో దరఖాస్తు అనుమతి ఉ ంటుందని 16 నుంచి 26 వరకు అన్‌లైన్‌లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని, 30వ తేదిన లాటరీ పద్దతిలో మొదటి జాబితా విడుదల చేయాలన్నారు. సెప్టె ్టంబర్ 2వ తేదిన జాబితా విడుదల చేస్తు 9వ తేది వరకు విద ఆయర్థులను అయా పాఠశాలల్లో చేర్చుకోవడం జరుగుతుందన్నారు. మిగిలిపోయిన సీట్లకు రెండవజాబితా సెప్టెంబర్ 12 నుంచి 30వ తేది వరకు పూర్తిచేయాలని కమిషనర్ అదేశించారు. రాష్ట ్రంలోని అన్ని యాజమాన్యాల ప్రైవేట్, అన్ఎయిడెడ్ పాఠశాలలు ఈనిబంధనలు తప్పక పాటించాలని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నిరుపేదలకు డి.బి. స్ప్లిట్స్ ఉచితంగా పంపిణీ

**కల్లూరు ఆగస్టు 4 ప్రభావార్త :** హెల్పింగ్ హ్యాండ్స్ డిసెబుల్ చారిటబుల్‌ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిరుపే దలకు ఉచితంగా డి.బి. స్ప్లిన్ట్‌ను అలాగే నైట్ స్ప్లిట్ ను జనవరి నెల నుంచి జూలై వరకు 120 మంది చిన్నారులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆర్థిక సహాయం ఇఏఫ్ అందించడం జరిగింది. వారి సహకారంతోనే నిరుపేదలకు మా ట్రస్ట్ తరుపునుండి ఈ పరికరాలను అందించడం జరిగింది. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ డిసెబుల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ పుట్టిన వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తే చినారులకు ఎటు వంటి అనర్థాలు జరగకుండా వారి కాళ్లు సక్రమంగా ఎదుగుదల అవుతుందని వారి అన్నారు. ఇటు వంటి మంచి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఈఏఫ్ వారి సంస్థకు మా ట్రస్ట్ తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.ఎందుకంటే ఎన్నో సంస్థలు ఉన్నాయి, కాని సహాయం అందించడంలో నిరాకరిస్తారు. సహాయం అందించే వారికి మా సంస్థ తరుపున ఇక్కా ఎన్నో కార్యక్రమాలు చేస్తామన్నారు. పుట్టినపుటి నుంచి చిన్నారులకు వంకర కాళ్లు గుర్తించి వారికి సరైన ట్రీట్ మెంట్ చేస్తే వంకరగా ఉన్న కాళ్లు యదాస్థానాలకు వచ్చి వారి ఎదుగుదల మంచిగా ఉంటుందన్నారు. అలాగే పుట్టిన పిల్లలకు కాళ్లు వంకరగా రావడంతో వారికి డి.బి. స్ప్లిన్ట్స్ బూట్లను కాళ్లు వంకరగా వచ్చిన పిల్లలకు అమర్చటం ద్వారా నయంఅవుతుంది. డాక్టర్ సలహామేరకు డి.బి. స్ప్లిన్ట్స్‌ను అమర్చటం జరుగుతుందనివారి తెలిపారు.




## నారా లోకేష్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**ఆదోని రూరల్,ఆగస్టు 4,ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై తప్పుడు సమాచారంతో ఆరోపణలు చేస్తే సహించేది లేదని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి బసాపురం వెంకటేష్‌చౌదరి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌నాయుడు,టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు మండిపడారు. గురువారం రాజస్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి,వైసిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవేందర్‌రెడ్డిపై స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నందు డిఎస్పీ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారా లోకేష్‌పై తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదారి పట్టించేలా చేయడం సరైంది కాదన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యను పక్కదారి పట్టించే విధంగా ఎన్‌టి రామారావు చిన్నకుమార్తె ఉమామహేశ్వరి మరణాన్ని దుష్ప్రచారం చేస్తున్న వైసిపి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి,సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవేందర్ రెడ్డిలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు తేజ, మహిళా కార్యదర్శి అంజనమ్మ తదితరులున్నారు.

## ఫేక్ వీడియో ద్వార ఆరోపణలు చేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న మాదాసి-మాదారి కురువ సంఘం నాయకులు

**పత్తికొండ,ఆగస్టు 4,ప్రభాతవార్త :** ఫేక్ వీడియోల ద్వార ఆరోపణలు చేస్తే సహించేది లేదని మాదాసి-మాదారి కురువ సంఘం రాష్ట్ర నాయకులు సోమలింగడు అన్నారు. గురువారం స్థానిక మాదాసి-మాదారి కురుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గోరంట్ల మాదవ్‌పై ఫేక్ వీడియోల ద్వార అసత్య ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. హిందూపురం ఎంపి గోరంట్ల మాదవ్ మాదాసి-మాదారి కురువ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆయన ఎదుగుతుంటే ఓర్వలేక ఫేక్ వీడియోలు చూపించి కించపరచి ఆయన మనోభావాలు దెబ్బతీసేలా చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం చేయకుండ ఇంతటితో సర్దిపెట్టుకుంటే మంచిదని లేదంటే మాదాసి-మాదారి కురువల సత్తా ఏమిటో చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాదాసి-మాదారి కురువ నాయకులు అంజినేయ,నరేష్,లక్ష్మన్న,బొంబాయి శీను,లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సిహెచ్ఓ,అంగన్‌వాడీలు

**హాలహర్వి,ఆగస్టు 4,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన హాలహర్విలో ఈ నెల 1 నుండి 7వ తేదీ వరకు చేపడుతున్న తల్లిపాల వారోత్స వాలను గురువారం అంగన్‌వాడి-4 సెంటర్ నందు ఘనంగా నిర్వహిం చారు. హెల్త్ డిపార్ట్‌మెంట్ సిహెచ్ఓ ఆదినారాయణ,హాలహర్వి సర్పంచ్ తండ్రి నరసప్ప,శిశు సంరక్షక శాఖ అధికారిణి లావణ్య,అంగన్‌వాడి టీచర్లు,ఆశావర్కర్లు,పిల్లల తల్లుల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ఓ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు పోషక ఆహారం పొందాలంటే ప్రసవం అయిన వెంటనే తన బిడ్డకు ముర్రుపాలు పట్టివ్వాలని ఆ పాలు పట్టడం వల్ల తమ బిడ్డకు పరిపోషకాలు పొందుతారన్నారు. కావున ప్రతి తల్లి తమ బిడ్డలకు పాలు తప్పనిసరిగా పట్టించాలన్నారు. బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలని ఆయన తెలియజేశారు. ఈ విషయాలను తల్లిపాల వారోత్సవాల్లో తల్లులకు తెలియజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఆదినారాయణ,హాలహర్వి సర్పంచ్ తండ్రి నరసప్ప,లావణ్య,అంగన్‌వాడి టీచర్లు అనసూయమ్మ,శ్రీదేవి,జ్యోతి,శ్రీదేవి,ఆశావర్కర్లు,శివమ్మ,విజయలక్ష్మి,పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణం

**ఆలూరు,ఆగస్టు 4,ప్రభాతవార్త :** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణమని ఎస్ఐ రామానుజులు అన్నారు. గురువారం ఆలూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న తిరుపాల్ నాయక్ బదిలీపై కర్నూలుకు వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు సభను హెడ్‌కానిస్టేబుల్ జానీ వకార్ అధ్యక్షతన ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామానుజులు మాట్లాడుతూ తిరుపాల్ నాయక్ ఆలూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కొన్ని నెలలే అయినా ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన విధుల పట్ల ఎంతో అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో ఉండాలని వారు పేర్కొన్నారు. అనంతరం శాలువా కప్పి పూలమాలతో ఆయనను సిబ్బంది ఘనంగా సన్మానించారు. సిబ్బంది నాగరాజు, రవి తదితరులున్నారు.

## ఆహార పదార్థాల వ్యాపారులు ఫాస్టాగ్ శిక్షణ సర్టిఫికెట్ పొందాలి

**- యాక్ట్ 51 పట్ల ప్రజలు,వ్యాపారులు అవగాహన పెంచుకోవాలి- ఫాస్టాగ్ రాష్ట్ర మేనేజర్ ప్రసాద్**

**కర్నూలు క్రైం,ఆగస్టు4,ప్రభాతవార్త:** దేశంలో భారత ప్రభుత్వం ఆదేశాల మేర కు ఆహార పదార్థాల వ్యాపారులు ఫాస్టాగ్ శిక్షణ సర్టిఫికెట్ పొందాలని,యాక్ట్- 51పట్ల ప్రజలు, వ్యాపారులు అవగాహన పెంచుకోవాలని ఫాస్టాగ్ రాష్ట్ర మేనేజర్ ఎం.సి.ప్రసాద్ పేర్కొన్నారు.నగరంలోని వెంకటరమణ కాలనీ ఫాస్టాగ్ జిల్లా కార్యాలయంలో యాక్ట్-51 పై రాష్ట్ర కో ఆర్డినేటర్ సి.మోహన్‌బాబు,సింధుజోషిల అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర మేనేజర్ ప్రసాద్,చాంబర్ ఆఫ్ కామర్స్ మరియు ఇండస్ట్రీ టి.వి.రత్నకుమార్, కర్నూలు హోటల్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీధర్ కల్కూరా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు ఆహార భద్రత నియమావళి పొసై వారి నిబంధనలను అనుసరించాలని సూచించారు.ఫాస్టాగ్ శిక్షణ సర్టిఫికెట్‌ను ప్రతి ఫుడ్ బిజినెస్ ఆపరేటర్ పొందాలని తెలిపారు.హోటల్స్,బేకరీస్,రెస్టారెంట్స్,ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్,స్వీట్ బేకరి,బిర్యాని పాయింట్స్,కూల్‌డ్రింక్స్,జ్యూస్ సెంటర్స్,మిల్క్,టీ హబ్స్,ఐస్‌క్రీమ్ పార్లర్,మెస్ అండ్ హోటల్స్,చికెన్,మటన్ స్టాల్స్ పై వ్యాపారులను అభివృద్ది పరిచే దిశగా ఫాస్టాగ్ సంస్థ అందించే శిక్షణ సర్టిఫికెట్లను తప్పకుండా తీసుకోవాలని తెలిపారు.ఇందుకు రుసుం రూ.2వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.ఫాస్టాగ్ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ వారి ప్రాంతాల వద్దకు,హోటల్స్ వద్దకే వచ్చి ఆధార్ జిరాక్స్ మరియు మొబైల్ నంబర్,షాపు పేరు సమాచారం సేకరిస్తారని వారు తెలిపారు.ఈ సమావేశంలో కె.వి.జి.వి.ఎం.సి సంస్థ నిర్వాహకులు ఎస్.కె.ఖాదర్ బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫాస్టాగ్ రాష్ట్ర మేనేజర్ ప్రసాద్

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

**దేవనకొండ, ఆగస్టు 4,ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధుల పట్ల మరియు కుష్టువ్యాధి పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా అన్నారు. గురువారం ఆశాడే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఎన్ఎంలు,ఆశాలు,ఎంఎల్‌హెచ్‌పిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి నివారణ,సీజనల్ వ్యాధులు ప్రబలకుండ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుష్టువ్యాధి నివారణ అధికారి దాసు,పిహెచ్‌సి సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి,ఈశ్వరయ్య,రాంమోహన్,హనుమంతమ్మ,ఉమాభాయి, మండల ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎంలు,ఆశాలు పాల్గొన్నారు.

